
# ఈస్ట్మన్ కలర్ ప్రేమ

జయంపు కృష్ణ



# నయాపూల్

ఒక స్వరాన్ని ప్రసవించడానికి ఎన్ని మెలికెలు తిరిగి పోతుందో ఒక తీగె, ఎంత వేదన అనుభవి ందో ఒక వేణువు మాకు తెలుసు, రవీంద్ర భారతి గోడలకేం తెలుసు?

సంగీత శిథిలాల్లో ఎంత మానవ బాధా ప్రకంపన ఉందో ఎవరికి తెలుసు—

ఒక శిశిర సాయంకాలం నయాపూల్ మీద నుల్చుని హైకోర్టూ ఉస్మానియా హాస్పిటల్ శిఖరాల మధ్య చిక్కుకున్న పశ్చిమా కాశాన్ని దర్శిస్తే తెలుస్తుంది ఈ బాధ....రాళ్ళు తప్ప జలాలు ప్రవహించని ఈ మూసీ నదిని గుండె మీద ఎందుకు మోస్తున్నావ్ ఓ హైదరాబాద్ అంటుంది ఏ లోతుల్లో నుంచో ఒక అంతఃస్వరం—

సికింద్రాబాద్ నుంచి బయలేరి ఉస్మాన్ సాగర్ దాటలేము ఉదయాస్త మానాల చేతుల్లో వంకరటింకర్లయి పోతున్న భూదృశ్య రేఖలు నౌబత్ పహాడ్ నుంచీ బోట్ క్లబ్బు వరకూ వ్యాపించి, నిన్ను కదల్చీవు — ఎన్ని బాధలు ముసురు కుంటాయో సముద్ర గుండంలోకి వాయువుల్లా!

దుఃఖాన్ని మోయని గీతం చరిత్రని మీటని లయ కుతుబ్ మీనార్ శేవి మల్చోని వాక్యాలు గంగ ప్రవహించని సమాసాలు కోటి కోటి పలెలూ పట్నాలూ గుసగుస లాడని అక్షరాలు-ఎన్ని కలిసినా ఏ తీగా కదలదు, ఏ వేణువూ పలకదు, ఏ గొంతూ మేలుకోదు.

సుఖదుఃఖాలు ఒక గంధర్వ గ్రామం, ఒక శాశ్వత మేళా....వెన్నెల తాగి తేగానీ వేణువులు ఏడ్చే సాయంకాలాన్ని భరించలేని మనిషి చెప్పలేని వేదన వేణువు అనుభవి ంది-ఎంత చరిత్ర!

- గుంటూరు శేషేంద్ర శర్మ

---

ఆవుట్‌డోర్ షూటింగ్‌కని ఆ వూరు వచ్చారు మదరాసు సినిమా వాళ్ళు.

ఆశా ప్రొడక్షన్స్ వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "ఆడది ఆగ్రహిస్తే" తాలూకు అవుట్ డోర్ వర్క్ ఆ వూళ్లో చేస్తే నాచురల్‌గా ఉంటుందని యూనిట్ అంతా భావించారు. ఆ వూరి పేరు పెదపాళెం.

ఆ వూరికంతా పెద్దవాడు, పెద్ద మనిషి మధుసూదనరావు. వాళ్ళది మూడంతస్థుల భవనం. వారింట్లోనే సినిమా వారి మకాం. హైదరాబాద్ నుంచి ఎవరో మినిస్టర్ సంబంధీకులు రెకమెండ్ చేస్తే ఆ ఏర్పాటు చేయక తప్పలేదు. అందునా ఉజ్జ్వల వర్ధమాన తార గిరిలక్ష్మి పాల్గొంటుంది ఆ షెడ్యూల్‌లో. ఆమె ఆ చిత్రానికి కథా నాయిక. ఆంధ్రుల ఆరాధ్య దేవత ఆమె!

షూటింగ్ జరుగుతోంది. జనాన్ని కంట్రోలు చేసేందుకు టవున్ నుండి పోలీసుల రాక తప్పనిసరి అయింది. వస్తూ వస్తూ వాళ్ళ ఫామిలీస్‌ను కూడా షూటింగ్ చూసేందుకు వెంటబెట్టు కొచ్చారు పోలీస్ విభాగం.

ఒక్క నమ్మినపోయిన ఆవిడ మోహమాటానికి పోతే... ఏదో అంటున్నట్టు — అన్నాళ్ళు జరిగిన షూటింగ్‌లలో రోజూ వాళ్ళతోపాటు తిరిగిన శేఖర్ బాబు — తిరిగి వాళ్ళు మదరాసు వెళ్ళిపోతుంటే — గిరిలక్ష్మితో తనూ వెళతానంటూ పట్టుపట్టాడు.

గిరిలక్ష్మికి శేఖర్ బాబు బాగా మాలిమి అయ్యాడు. గిరిలక్ష్మి వెళతానంటే ... తన ప్రాణాన్నెవరో లాక్కెళుతున్నట్టు గిలగిల తన్నుకోసాగాడు అందుకే.

శేఖర్‌బాబు మధుసూదనరావుకు ఒక్కగా నొక్క కొడుకు. అక్షలకు వారసుడు. పోస్ట్ గ్రాడ్యుయేషను ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాయడం పోస్ట్ పోన్ చేసుకొని, ఈ ఫైన్ హీరోయిన్ వెంటే మదరాసు ప్రయాణం కట్టాడు.

మధుసూదనరావు భార్య లలితకు ఇదిష్టంలేదు. అంతేగాదు సినిమా ప్రపంచం అంటే 'మరోలోకం' అని ఆమె అభిప్రాయం. అందుకే ఈ ప్రయాణానికి ఆమె ఒప్పుకోలేదు. మధుసూధనరావు భార్యతో ఏకీభవించాడు. కానీ, శేఖర్‌బాబు పట్టిన పట్టు విడువలేదు. తల్లీ తండ్రీ పరమ చాందసులుగా కనిపించారు అతనికి —

"సర్వాలేదు. ఏదో సరదా పడుతున్నాడు. రానివ్వండి. మా ఇంట్లో మేం ఉన్నన్ని రోజులు మా ఇంట్లో ఉంటాడు. ఆ తర్వాత వచ్చేస్తాడు. శేఖర్ బాబు మరీ చిన్న పిల్లవాడేం కాదుగా?" అంటూ గారాలు పోయింది గిరిలక్ష్మి వాలు జడను ముందుకు లాక్కొని — షాట్‌లో నిలుచొని డైలాగు చెబుతున్న భంగిమలో.

చివరకు ప్రొడ్యూసరు వాళ్ళంతా "పంపండి" అంటూ కలగ జేసుకోవడంతో ఇష్టం లేకపోయినా ఒప్పుకున్నాడు మధుసూదనరావు. లలిత మనసు మాత్రం దేవుతోంది. శేఖర్ బాబు ఎంచక్కా మస్తైబై గిరిలక్ష్మితో బయలుదేరి మదరాసు వెళ్ళాడు.

మదరాసు సినిమా వాతావరణం వింతగా, కాంతిగా ఉషారుగా, విషాగా ఉంది. గిరి లక్ష్మి ఏలోటూ లేకుండా చూస్తూంది శేఖర్ బాబును.

ఒక రోజు. . . మహాబలిపురం, వి. జి. పి. గార్డెన్స్ సొగసులు చూపించింది. "ఇంత అందమైన ప్రపంచాన్ని చూడకుండా ఆ మారుమూల పల్లెల్లో బురదలో పురుగుల్లా ఎలా ఉంటారు మీరు?" అని అడిగింది గిరిలక్ష్మి శేఖర్‌బాబు కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"నిజమే. ఇక్కడ ఎంత బాగుంది?. . . ఇవన్నీ చూస్తుంటే. . .?" తడబడుతూ అన్నాడు శేఖర్ బాబు.

"చూడాల్సినవి. . . ఇంతకన్నా గొప్పవి ఇంకా బోలెడున్నాయ్. అన్నీ చూపిస్తాను" అన్నది గిరి లక్ష్మి పెదాల్ని మృదువుగా పిండుకుంటూ.

ఇదంతా రేసు గుర్రాల్లా మెరిసి పోతూ, అంత వేగంగా పరుగెడుతున్న కారులో జరిగిన సంభాషణ.

ఆ రాత్రి—

తనకు ప్రత్యేకించిన గదిలో స్నానం చేశాక మెత్తని సోఫాలో రిలాక్స్‌గా కూర్చుని, ఆ పక్కనే ఉన్న ఒకమేగజైన్ అందుకుని తిరగేశాడు శేఖర్‌బాబు.

అందులో ఒకపేజీలో ఒక అందమైన అమ్మాయి తన యౌవ్వన సొగసులను ప్రదర్శిస్తూ, స్నానం చేస్తూ ఉంది. అలాంటి బొమ్మలు ఎప్పుడూ చూడలేదు శేఖర్‌బాబు.

అలాగే కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నాడు.

అప్పుడే అక్కడికొచ్చిన గిరిలక్ష్మి—"శేఖర్ బాబూ! నేనూ స్నానం చేస్తాను. తరవాత ఇద్దరం కలిసి భోజనం చేద్దాం. ఓ. కే?" అంటూ నవ్వి వెళ్ళిపోయింది. ఆమె ఒంటికి పులుముకుని ఉన్న పరిమళాలు ఆ గదిలోనే మిగిలి పోయాయ్, ఆమె రాకకు గుర్తుగా మరో క్షణంలో.

శేఖర్‌బాబు కూర్చుని ఉన్న సోఫాకు ఎదురుగా గోడకు ఉన్న కర్టెన్ ఆటోమాటిక్‌గా పక్కకు వెళ్ళి పోయింది. అటు చూశాడు శేఖర్‌బాబు ఆ శబ్దానికి.

ఆశ్చర్యం!

అలాగే కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

అది గోడ కాదు. మందమైన గ్లాసులా ఉంది. ట్రాన్స్‌పరెంట్‌గా ఆవల గదిలోఎవరో ఒక అందమైన అమ్మాయి ఇంతకు ముందు మాగజైన్‌లో చూసిన బొమ్మలా ఒంటరిగా స్నానం చేస్తూంది. ఒంటి మీద బట్టల్లేవు. నీలి రంగు విద్యుద్దీప కాంతిలో ఆమె ఒళ్ళు మెరిసి పోతోంది. మధ్య మధ్య ఆమె విశాల నేత్రాలు సూర్యకిరణాలు సోకి మెరుస్తున్న ట్లు తళుక్ తళుక్ మంటున్నాయ్.

పాలాభిషేకం జరుగుతున్న చలువరాతి నగ్న శిల్పం ప్రాణం పోసుకుంటున్నట్లు—

ఎదిగిన తీగ పూసిన పువ్వులు రెక్కలొచ్చి ఎగిరి పోతున్నట్లు—

తాజా వార్తలకు
ఆంధ్రప్రభ దిన-పత్రిక
చదవండి





కేశ సంపదకు
రిటా




స్త్రీలూ పురుషులూ వాడవచ్చును
సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది


ఆకాశాన పాలపుంతల్లో నక్షత్రాలు ప్రణయ నృత్యాలు చేస్తున్నట్లు—

ఏ లోకంలో ఇది?

ఆమె ఎవరు?

గిరిలక్ష్మి?

గిరిలక్ష్మి"

అవును. . .

నవ్వుతూ ఉంది, కవ్విస్తూ ఉంది. . . తెల్లని, సన్నని ఆమె శరీరంపై జాల్వారుతున్న నీరు. . . పన్నీరు—ఆమె అందాల్ని అర్చిస్తున్నట్లు, ఆరాధిస్తున్నట్లు ప్రదక్షిణలు చేస్తున్నట్లు. ఓహో...

చేతులు పైకెత్తి, తల మీది శిరోజాలను ముడి విప్పుతోంటే ఆకాశంలో మీదికి వస్తున్న శత్రు విమానాలను కాల్చి పారేయాలని సూటిగా పైపైకి గురి పెడుతూ లేస్తున్నవిమానవిధ్వంసక శతఘ్నుల్లా ఆమె రొమ్ములు—

గోడన్నా నులు పగల గొట్టుకొని లోపలికి వెళ్ళాలనిపిస్తోంది శేఖర్ బాబుకు.

ఇంతలో లైట్లు ఆరిపొయ్యాయ్. ఆ రేయి తెల్లవారే సమయాన—

"శేఖర్ బాబూ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అని చెప్పాయ్ మృదు మధురంగా గిరిలక్ష్మి పెదవులు శేఖర్‌బాబు గుండెల్లో.

* * *

బిడ్డ దగ్గర నుంచి వచ్చిన లేఖను ఆత్రతగా చదవ సాగారు శేఖర్‌బాబు తల్లి దండ్రులు.

"ప్రియమైన తల్లిదండ్రులకు. నమస్తే.

నాకు మదరాసులో గిరిలక్ష్మి తిప్పి తిప్పి అన్నీ చూపించింది. ఇన్నాళ్ళూ నేను బావిలో కప్పలా ఉన్నాను. అసలు ప్రపంచం ఏమిటో, జీవితం ఎంత గొప్పదో ఇక్కడి కొచ్చి తెలుసుకున్నాను.

ఇక నేను చదువుకోను. వ్యాపారం చెయ్యాలను కుంటున్నాను.

ఒక సినిమా తియ్యాలని నిర్ణయించుకున్నాను. గిరిలక్ష్మి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చింది.

నేను తీయ బోయే సినిమా పేరు, 'ప్రేమా పిచ్చీ ఒకటే'.

చాలా చీప్‌గా తీసి, లక్షలు సంపాదించ వచ్చు. మొదట బ్లాక్‌అండ్ వైట్‌లో తియ్యాలనుకున్నాను. కానీ, జనం కలర్ సినిమాలకు అలవాటు పడి పోయారు. అందుకని 'ఈస్ట్‌మన్ కలర్' లోనే తీస్తాము.

గిరిలక్ష్మి చాలా మంచిది. తన డబ్బు తోనే కథ మీద డిస్కషన్ జరుగుతోంది.

నేను నాలుగు రోజుల్లో అక్కడి కొస్తున్నాను. అన్ని విషయాలు వివరంగా చెబుతాను. డబ్బు సర్ది ఉంచండి.

ఉంటాను.

మీ సుపుత్రుడు

—శేఖర్."

పి. ఎస్: అన్నట్టు ఈ చిత్రానికి నిర్మాతను నేను, డైరెక్టర్ గిరిలక్ష్మి.

'కొంప కూలింది బాబోయ్' అంటూ మధుసూదన్‌రావ్, లలిత తల పట్టుకుని కూర్చున్నారు,

ఉత్తరం చదివాక.

* * *

శేఖర్‌బాబు పెదపాళెం కారులో వచ్చాడు దర్జాగా— వేషం పూర్తిగా మారిపోయింది.

సినిమాలో హీరోలా ఉన్నాడు. మనిషి బాగా తేరాడు. రంగు వచ్చాడు. ఆ పూళ్ళో కొంద రసలు కనుక్కోలేక పోయారు.

ఇంటికి వచ్చి, అప్పుడే వెళ్ళి పోవాలని వేగిర పడుతూ వెంటనే లక్ష రూపాయలు కావా లన్నాడు.

మొదట తలి దండ్రు లిద్దరూ వద్దన్నారు. "ప్రెస్టేజి" అంటే ఏమిటో, అది పోయిన నాడు తను దక్కనని అయినా వ్యాపారం చేస్తే తప్పే మ్ముందనీ, అలా అనుకుని ఉంటే అసలు సినిమా నిర్మాత అనేవాడు ఒక్కడూ మిగలడనీ, ఇన్ని సినిమాలు తయారయ్యేవి కావనీ—

దేశంలో మార్పు రావాలంటే సినిమాలే శరణ్యం" అంటూ ఒక చిన్న ఉపన్యాసం దంచాడు శేఖర్‌బాబు.

తల్లి తన ధోరణిని మార్చుకోలేక పోయినా, తండ్రి దిగిరాక తప్పలేదు కొడుకు బెదిరింపుకు.

"సరే! చూద్దాం! !డబ్బు తర్వాత సర్దుతాను" అన్నాడు మధుసూదనరావు. శేఖర్‌బాబు అదే కారులో మదరాసు వెళ్ళిపోయాడు చాలా ఏర్పాట్లు చెయ్యాలని అంటూ.

ఒక్క పూటయినా బిడ్డ తృప్తిగా భోజనం చెయ్యనందుకు, ఒక్కరోజయినా ఇంట్లో ఉండ నందుకు తల్లి క్రుంగిపోయింది.

ఒక్కగానొక్క బిడ్డ ఇలా అయిపోతున్నందుకు లలో తాను కుమిలి పోసాగింది.

* * *

నాలుగు రోజులకే శేఖర్‌బాబు నుండి టెలిగ్రామ్ వచ్చింది, డబ్బు వెంటనే పంపమని. మధుసూదనరావు డబ్బు పంపాడు.

ఆ తర్వాత రెండు రోజులకే—శేఖర్‌బాబు తీసే సినిమాకు సంబంధించిన పబ్లిసిటీ అన్ని పేపర్లలోనూ వచ్చేసింది.

శేఖర్‌బాబు సినిమా తీస్తున్నట్లు తెలుసుకున్న ఆ ఊరివాళ్ళు, బంధువు లు—మధుసూదనరావును తెగ పొగిడెయ్యసాగారు. ఈ క్రొత్త ధోరణి అతనికి చిత్రంగా గోచరించింది.

ఎన్ని విన్నా, ఎందరు ఎన్ని అన్నా లలిత హృదయం మాత్రం క్షోభిస్తూనే ఉంది. ఆమె పేగులు అదే పనిగా దేవుళ్ళాడసాగాయి.

మళ్ళీ మళ్ళీ డబ్బు పంపమని టెలిగ్రాంలు కొట్టసాగాడు శేఖర్‌బాబు—లేకపోతే పెట్టిన డబ్బు పోతుందని రాశాడు.

'పెట్టిన డబ్బు పోతే ఎలా?... లక్షలు...' అనుకుంటూ వ్యవసాయంలోనూ, ఎలక్షన్ల గొడవల్లోనూ తలమునకలుగా ఉన్న మధుసూదన రావు—అవసరంకొద్దీ అరటితోట, ఆకుతోట అమ్మి డబ్బు పంపించాడు.

లలిత నెత్తీ, నోరూ కొట్టుకోసాగింది. మధు సూదనరావు నోదార్చాడు.

తీరా చూస్తే...సినిమా 'ఇంటర్‌వెల్' వరకూ అయిందీ—మిగిలింది పూర్తి కావాలంటే ఇంకెంత డబ్బు కావాలని రాశాడు శేఖర్‌బాబు. వసం తీసిన



ముంగిట

చిత్రం— టి. ఎస్. సి. అంజనేయులు

సినిమా ఎందుకూ పనికిరాదని తెలిసింది. బెంబేలు పడిపోయారు తల్లితండ్రులు. విధిలేక—మిగిలిన చెరకుతోట, కొంత మాగాణి అమ్మకానికి పెట్టాడు మధుసూదనరావు.

ఒకటి ముక్కలుగా ధర పలికింది—దాంతో ఇక లాభంలేదనుకొని, లలిత ధైర్యం చేసి, "పోయిన డబ్బు పోతే పోయింది.—మిగిలిన దానితోనయినా హాయిగా బ్రతకొచ్చు. మదరాసు వెళ్ళి, నాలుగు మాట్లు వేసి, అబ్బాయిని తీసుకురండి— ఆ తీసిన సినిమా గిరిలక్ష్మి ముఖాన్నే కొట్టి. కనీసం అబ్బాయి నయినా దక్కించుకుందాం" అంటూ భర్త పాదాలు పట్టుకుని ప్రాధేయపడింది.

మధుసూదనరావు బాగా ఆలోచించి—సరేనని, వస్తున్నట్లు శేఖర్‌బాబుకు ఒక టెలిగ్రాం ఇచ్చి, మదరాసు బయలుదేరాడు.

* * *

వచ్చేవాళ్ళకు స్వాగతం, వెళ్ళేవాళ్ళకు వీడ్కోలు చెప్పే మదరాసు సెంట్రల్‌లో రైలు దిగిన మధుసూదనరావును— గిరిలక్ష్మి, శేఖర్‌బాబు జంటగా వచ్చి పూలమాలలతో రిసీవ్ చేసుకొని, పూల పడవలాంటి కారులో బంగళాకు తీసుకువచ్చారు.

గిరిలక్ష్మి అప్సరసలా తయారయివచ్చింది. ఆమె బంగళా మరింత శోభాయమానంగా— మయుని మందిరంలా—వెలిగి పోతోంది. కాంపౌండ్, పోర్టికో, డ్రాయింగ్‌రూమ్, బాత్‌రూమ్, డైనింగ్ రూమ్, ఆఫీస్‌రూమ్, బెడ్‌రూమ్—ఎంత టేస్ట్ కావాలి?? ఎంత ఇంటరెస్ట్ ఉండాలి?? ఎంత కాస్ట్లీ లైఫ్—

అందుకే తేనెలో పడ్డ ఈగలా తన కొడుకు అలా గిజగిజా కొట్టుకుంటూ ఉన్నాడు—మధు సూదనరావు మతి పోతోంది.

* * *

మధ్యాహ్నం విశ్రాంతి లేవగానే—ట్రేలో టీ పట్టించుకొని, గిరిలక్ష్మి స్వయంగా వచ్చి, టీ సర్వ్ చేసింది.

ఆమె డ్రస్ చేసుకుని ఉందా?లేదా??—అన్న అనుమానం వచ్చింది మధుసూదనరావుకు. దేహశా వస్త్రాలు అంటే అవేనేమో??—నిమ్మపండు లాంటి ఆమె శరీరం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది. ఏ ఫారిన్ సెంటో మత్తుగా పైపైకి ఎగబడుతోంది.

టీ త్రాగడం పూర్తి చేశాక—"ప్రేమా పిచ్చి ఒకటే" సినిమా కథ గురించి, రషెస్ గురించి, ఎడిటింగ్ గురించి, లొకేషన్స్ గురించి,—అన్నీ వివరంగా చెప్పసాగింది అభినయ పూర్వకంగా

అంబడిపూడి
సెక్సు విజ్ఞాన ప్రచురణలు
1. గర్భమూ—గర్భ నిరోధం ( 40 చిత్రాలలో ) 2. గుప్తజ్ఞానం ( 6000 మంది దంపతుల సమస్యలకు పరిష్కారం) 3. స్త్రీ కోరే దేమిటి? 4. అరచేతిలో వైకుంఠం ( అందరినీ ఒప్పించడం, మెప్పించడం ఎలా?) 5. కోర్కెలు తీరడానికి 100 మంత్రాలు. 6. భయమెందుకు ( యువ్వన దురభ్యాస బాధితులు) 7. స్వామి అయ్యప్ప 8. దయ్యాలు చేసే గమ్మత్తులు. 9. సరస శృంగారాలు ( ముద్దు ముచ్చటలు ) రు. 25/— మనియార్డరు పంపిన వారికి పంపబడును. వి. పి. పద్ధతి లేదు. ముందుగా డబ్బు పంపాలి.
జలజ ప్రచురణలు, విజయవాడ-3




ఉచితం! ఉచితం !!
తెల్లమచ్చలు
మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగ వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.
LALIT AYURVEDIC
PHARMACY (AW)
P.O. Katri Sarai (GAYA)

ఆ అభివృద్ధి. ఆ చిత్రంలో గిరిలక్ష్మి కథానాయకురాలు కూడా.

మాట్లాడుతూనే — మధ్యమధ్యలో ఫోన్‌కాల్స్ అందుకుంది. సెక్రటరీకి ప్రోగ్రామ్స్ గూర్చి చెప్పింది. బిజీగా ఉంది.

"శేఖర్ ఎక్కడికెళ్ళాడు??" ఆమె చెప్పిందంతా తదేకంగా విని, కుమారుణ్ణి గురించి అడిగాడు మధుసూదనరావు.

"స్టూడియోకు వెళ్ళారు. షెడ్యూల్ దగ్గిర కొస్తూ ఉంది. సెట్స్ చూసిరమ్మని పంపాను. వస్తూనే ఉంటారు" అన్నది వాలుజడను ముందుకు వేసుకొని, ముద్దుగా కొన మెలిపెడుతూ.

"చూడండి గిరిలక్ష్మిగారూ? అయిందేదో అయింది. ఇప్పటివరకు తీసిన పిక్చర్ మీరు ఉంచుకోండి. ఇవాళే మా అబ్బాయిని తీసుకొని మా వూరెళ్ళి పోతున్నాను. అందుకే వేనొచ్చింది." నిక్కచ్చిగా చెప్పేశాడు మధుసూదనరావు.

గిరిలక్ష్మి ముఖంలో ఎక్స్‌ప్రెషన్ మారిపోయింది. మళ్ళీ అంతలోనే ఫ్రెష్ మూడ్ తెచ్చుకుని, "మరి దాని మీద పెట్టిన డబ్బు?" అన్నది కనుబొమలు బాగా పైకెత్తి వంచి.

"పోతే పోయింది.. ఇవాళ రాత్రికే మేం వెళ్ళి పోతున్నాం" అంటూ ఆమెకు మరో మాటకు ఛాన్స్ ఇవ్వకుండా చివాల్న లేచాడు మధుసూదనరావు. గిరిలక్ష్మి కూడా లేచి నిలుచుంది.

అంతలోనే శేఖర్‌బాబు ఈలవేసుకుంటూ, హుషారుగా లోపలికొచ్చాడు. ఏదో చెప్పబోయాడు.

మధుసూదనరావు అడ్డుకొని, "ఇక మనకు సినిమా వద్దు, గినిమా వద్దు. మీ అమ్మ ఆరోగ్యం కూడా అంత బాగా లేదు. నిన్ను వెంటనే తీసుకు రమ్మంది. రాత్రికే మన ప్రయాణం" అని చెప్పేశాడు—తిరుగులేనట్టు.

శేఖర్‌బాబు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఫ్లీజు అయినట్టు అలాగే ఆగిపోయాడు.

గిరిలక్ష్మి కొంచెం చొరవ తీసుకొని, "అది కాదండీ" అంటూ ఏదో చెప్పబోయింది.

"మీరేం చెప్పినా, ఎన్నిచెప్పినా నేను వినదలచుకో లేదు" అన్నాడు ధృడంగా మధుసూదనరావు.

"మరి, చిత్రంతాలూకు రాతకోతలన్నా నా పరం చెయ్యాలిగా? దయచేసి ఆ పనయినా చేసి వెళ్ళండి. మిగిలిన చిత్రాన్ని నేనే పూర్తి చేసుకుంటాను. మళ్ళీ నా షెడ్యూల్స్ దెబ్బతింటే ... ఆర్టిస్టుల కాల్‌షీట్లకు ఇబ్బంది అవుతుంది" అన్నది గిరిలక్ష్మి ప్రార్థిస్తున్నట్లు దీనంగా.

ఒక క్షణం ఆలోచించాడు మధుసూదనరావు.

"సరే ... శేఖర్! నీ ప్రయాణం మాత్రం రాత్రిబండికే. అందులోమార్పులేదు. అన్నీ సర్దుకో. నేనుండి రేపంతా ఈ తతంగం పూర్తి చేసుకొని, రేపు రాత్రికి వస్తాను" అన్నాడు సీరియస్‌గానే.

ఫ్రీజు నుండి రిలీజు అయినట్లు శేఖర్ బాబు చలనం తెచ్చుకొని, "ఇద్దరం కలిసి ఏకంగా రేపే వెళదాం నాన్నా" అన్నాడు.

"మనకోసం అక్కడ మీఅమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది, గంగ కూడా ముట్టకుండా. నువ్వు ముందెళ్ళి చెప్పు, నేను వెంటనే వస్తాను" అన్నాడు.

తండ్రి ఉగ్ర స్వరూపం చూసి, ఇక లాభం లేదనుకొని, సూట్‌కేస్‌లుసర్దుకోసాగాడు శేఖర్‌బాబు దిగాలుగా. తల్లీ తండ్రీ ఎవరూ లేకుండా ఉండి ఉంటే ఎంతో బాగుండే దనిపించింది ఆ క్షణంలో...

గిరిలక్ష్మికి మరో మాట మాట్లాడే ధైర్యం లేకపోయింది.

మధుసూదనరావు, గిరిలక్ష్మి వెళ్ళి శేఖర్‌బాబును బలవంతంగా ట్రెయిన్ ఎక్కించి వచ్చారు.

ఆ రాత్రి—

మధుసూదనరావుకు తన ఇంట్లో ఏ లోటూ కలగకుండా అన్ని ఏర్పాట్లు స్వయంగా చేసింది గిరిలక్ష్మి.

కుమారుడుకూర్చుని మేగజైన్‌లో'స్నానసుందరి' బొమ్మను చూసిన గదిలోనే — తండ్రికీ విడిది ఏర్పరిచింది.

స్వర్గదృశ్యాలు చూపించింది. తండ్రి హృదయం కూడా రస స్పందన చెందే సమయాన "మధూ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అని చెప్పాయి మృదు మధురంగా గిరిలక్ష్మి పెదవులు మధుసూదనరావు గుండెల్లో.

ఆ రాత్రిని తడిపిన వర్షం తెల్లవారుజామున వెలిసింది.

* * *

మెరీనా బీచ్‌లో సూర్య భగవానుడు మార్నింగ్ వాక్ చేస్తున్నాడు. మధుసూదనరావు వళ్ళు విరుచుకొని, కళ్ళు తెరవగానే — అభ్యంగన స్నానం సమాచరించి, ధవళవస్త్ర ధారిణియై అప్పుడే వికసించిన మల్లెపువ్వులా పరిమళం వెదజల్లుతూవచ్చి, గిరిలక్ష్మి టీ అందించింది.

రాత్రి జ్ఞాపకాలు కళ్ళు తెరిచాయి మధుసూదనరావు రక్తనాళాల్లో. ఆ అందాలరాశిని అలాగే చూస్తూ, 'టీ సేవ' పూర్తి చేశాడు.

ఖాళీ కప్పులు అందుకుని, ప్లాటినం పాళీ అతని చేతి కందించి, నవ్వులు వెదజల్లి, పువ్వులా నడిచి పోయింది గిరిలక్ష్మి.

భార్యకు ఉత్తరం రాయసాగాడు మధుసూదనరావు.

"ప్రియమైన లలితకు:

ఉభయకుశలోపరి! రాత్రి అబ్బాయిని నీ మాట ప్రకారం మన వూరికి బండెక్కించాను. ఇవాళ వాడు నిన్ను చేరుకొంటాడు. అయితే —

ఇక్కడికి కొచ్చి అన్ని విషయాలు పరిశీలించాక అబ్బాయి చెప్పింది నిజమేననిపిస్తూంది. ఇన్ని లక్షలు! ఖర్చుపెట్టి సినిమా మధ్యలోనే ఆపేస్తే ఏం బావుంటుంది? తీసినంతవరకు రాత్రి చూపించింది గిరిలక్ష్మి. ఈస్ట్‌మన్ కలర్‌లో చాలా బాగా వచ్చింది పిక్చర్.

అందుకే —

నేనో నిర్ణయాని కొచ్చాను. అబ్బాయి నీ దగ్గరే ఉంటాడు. నేనిక్కడుండిమిగిలిన సినిమాను పూర్తి చేసుకొని వస్తాను.

చెరుకుతోట, మాగాణి కూడా మీ బాబాయి సహాయంతో ఏదో ఒక రేటుకు అమ్మేసి, డబ్బు మొత్తం నాకు పంపించండి. పిక్చర్ విడుదలయ్యాక అంతకు పదింతలు ఆస్తిని కొనుక్కోవచ్చు. ఆ తర్వాత

కూడా తీద్దాం అనుకుంటే మరో సినిమా తీద్దాం. ఇదే వ్యాపారంచేద్దాం. అందరం మదరాసులోనే కాపురం పెడదాం.

నే వెందుకు చెబుతున్నానో కాస్త చెవిన పెట్టి, అలా చెయి నీ చాదస్తాన్ని అవతల పెట్టు. నీ వల్ల కాకపోతే మన వూరి కరణాన్ని నేను రమ్మన్నానని చెప్పి, నా దగ్గరకు పంపు. ఆ ఏర్పాటేదో నేనే చూసుకుంటాను. అంతేకానీ — సినిమా మాత్రం మధ్యలో ఆగేదానికి లేదు.

ఇంతే సంగతులు

ఇట్లు,

—మధుసూదనరావు"

ఆ ఉత్తరం నిమిషాల మీద పోస్టు బాక్సులో కెళ్ళింది. మధుసూదనరావు మరో గంటలో మూపాబై గిరిలక్ష్మితోపాటు స్టూడియోలో సెట్స్ చూసేందుకు బయలుదేరాడు. మధ్యలో ఫైవ్‌స్టార్స్ హోటల్లో ఆగారు.

* * *

వెంటనే డబ్బు పంపమని పెదపాళెం టెలిగ్రాం ఇచ్చి వచ్చి, హాల్లో సోఫాలో దగ్గర దగ్గర కూర్చుని, కూల్ డ్రింక్సు తాగుతున్నారుమధుసూదనరావు, గిరిలక్ష్మి — ఆనందంగా.

గిరిలక్ష్మి కూల్ డ్రింక్‌లో మునిగి ఉన్న స్ట్రా మీద ఏదో జోక్ వెయ్యగానే, మధుసూదనరావు పడిపడీ నవ్వసాగాడు.

అదే సమయంలో — సూట్‌కేస్‌తో లోపలికొచ్చిన శేఖర్ బాబును చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

వాళ్ళిద్దరినీ ఆ దశలో చూసిన శేఖర్‌బాబు అలాగే ఆగిపోయాడు అక్కడే.

మధుసూదనరావే—"ఏరా మళ్ళీ వచ్చావ్? వూరికి పోలేదా?" అని అడిగాడు హుందాగా.

"లేదు నాన్నా! వూరికి వెళ్ళలేకపోయాను. వెళ్ళలేను. అందుకే బెజవాడలో దిగి, డిస్ట్రిబ్యూటర్స్ దగ్గరుండి—మళ్ళీ మదరాసు రైలెక్కాను" అన్నాడు తలవంచుకుని.

"నేను చెప్పిందేమిటి?? నువ్వు చేసిందేమిటి?? అక్కడ మీ అమ్మ ఏమైపోవాలనుకున్నావ్??" అంటూ కోపంగా పైకి లేవబోయాడు మధుసూదనరావు.

"అబ్బ! మీరుండండి" అంటూ గిరిలక్ష్మి జోక్యం చేసుకుని, శేఖర్‌బాబును పట్టుకుని, పక్క గదిలోకి నడిపించుకుపోయింది.

మధుసూదనరావు చిందులేస్తూ, మేడపైన తన గదిలోకి వెళ్ళిపోయాడు

* * *

ఆ రోజు సాయంకాలం—

తండ్రీ, కొడుకులిద్దరినీ హాల్లో సమావేశపరిచింది గిరిలక్ష్మి.

అంతకుముందు ఇద్దరినీ వేర్వేరుగా కలుసుకుని మంతనాలు సాగించింది.

"కాబట్టి ఇద్దరూ వూరికి వెళ్ళనవసరం లేదు. సినిమా పూర్తి కాగానే వెళ్ళొచ్చు. మీరిక్కడుండొచ్చు కుంటే. అయితే ఒక షరతు. ఇంట్లో ఉన్నప్పుడు మధుసూదనరావు మేడ మీద నుండి క్రిందకు

---

ప్రేమ పైనుండి క్రిందికి ప్రవహిస్తుంది. తలిదండ్రులపై పిల్లల ప్రేమ కన్న, పిల్లలపై కన్న వారికున్న ప్రేమ వేయిరెట్లు ఎక్కువ. భగవంతుడు మనిషిని ప్రేమించిన దానిలో సహస్రాంశం కూడా మనిషి దేవుని ప్రేమించడు.

— హార్

---

దిగటానికి వీల్లేదు. శేఖర్‌బాబు కింద గదిలోనుండి మేడపైకి ఎక్కడానికి వీల్లేదు. ఇద్దరికీ ఏ లోటూ లేకుండా నేను చూసుకుంటాను. ఓ.కే.?" అంటూ కైపుగా నవ్వుతూ ఇద్దరి చేతులు కలిపింది.

గిరిలక్ష్మి సెక్రెటరీ "ఓ.కె." అంటూ చప్పట్లు కొట్టాడు.

మధుసూదనరావు, శేఖర్ ఇద్దరూ అర్థం అయినట్లు నవ్వుకున్నారు.

* * *

నాలుగు రోజుల తర్వాత—

పెదపాళెం నుంచి కరణం వచ్చాడు. తండ్రీ కొడుకులను వచ్చి, మిగిలిన ఆస్తిని అమ్మకు పొమ్మని లలిత చెప్పి పంపిన మాటలు లెక్కపెట్టకుండా—ఆస్తి అమ్మకం కరణానికి ఏర్పాటుచేశారు.

అలాగే జరిగింది.

* * *

"ప్రేమాపిచ్చి ఒకటే!" చిత్రం పూర్తయింది.

గిరిలక్ష్మి కథానాయికగా, దర్శకురాలిగా పేరు వేసుకుంది.

నిర్మాతలుగా తండ్రీ కొడుకుల పేర్లు పడ్డాయి క్రెడిట్స్‌లో.

చిత్రం విడుదలయింది. విచిత్రంగా మిజరబుల్ ఫ్లాప్ అయింది.

వారం రోజులకే డబ్బాలు తిరిగి వచ్చాయ్. క్షణంలో ఆస్తంతా పోగొట్టుకున్న మధుసూధనరావు, శేఖర్‌బాబుల స్థానం గిరిలక్ష్మి బంగళా బయట అని తెలిసింది. బంగళా తలుపులు గడియలు పడ్డాయి. ఆల్సేషియన్ డాగ్స్ కాపలా కాశాయి. ఏం మాట్లాడేందుకూ ఏ ఆధారమూ లేదని తెలుసుకునేందుకు ఎంతో సేపు పట్టలేదు.

ఆ రాత్రే దొంగల బండి ఎక్కాల్సి వచ్చింది వాళ్ళు.

* * *

తెంతెం పారుతుండగా పెదపాలెం చేరుకున్నారు మధుసూధనరావు, శేఖర్‌బాబు.

అపురావురుమంటూ ఇంటి కెళ్ళారు, ఇల్లయినా మిగిలిందన్న సంతోషంతో.

తలుపులు బార్లా తెరిచి ఉన్నాయ్.

వాకిట్లోనే ద్వారానికిఆనుకుని, ఎక్కడో దూరంగా అలానే చూస్తూ నిలుచుని ఉంది లలిత.

చలనరహితంగా బొమ్మలా ఉన్న ఆ తీరుకు తండ్రీ కొడుకుల గుండె లొక్కసారి భయంతో కొట్టుకున్నాయి.

"భగవంతుడా!" అనుకుని, పరుగు పరుగున ఆమె దగ్గరకు వెళ్ళారు.

ఇంకా అలాగే ఎక్కడో శూన్యం లోకి చూస్తున్న ఆమెను ఆందోళనగా పలకరిస్తూ—

"లలితా!" అంటూ పైన చెయ్యి వెయ్యబోయాడు మధుసూధనరావు.

చటుక్కున ఒక్క అడుగు వెనక్కు వేస్తూ, "నేనూ పోతే మీరు అనాథలుగా మిగిలి పోతారని మీ కోసం రోజూ ఇలా ఎదురు చూస్తూ మిగిలి ఉన్నాను. ఇదే నేను ఇల్లు వదిలి ఇన్నాళ్ళు బయట ఉండి వస్తే, మీరు ఇంట్లోకి రానివ్వరు. కానీ ఈ ఇంటి ఇల్లాలుగా మిమ్మల్ని నేను ఇంట్లోకి ఆహ్వానిస్తున్నాను. రండి." లలిత గంభీరంగా అంటూ ఇంట్లోకి దారి తీసింది.

తండ్రీ కొడుకు లిద్దరి కళ్ళూ చెమ్మగిల్లాయి.

ఆ దేవత పాదాలు కళ్ళకద్దుకోవాలని ఇద్దరూ లోపలికి నడిచారు. ✳

---

## గూడు క్రింద పక్షులు

ఖాళీ రోడ్డుపై మల్లెపూలు కొట్టుకుపోతున్నాయి దుమారంలో
కళ్ళలో నుంచి ఆశలు అస్తమిస్తున్నట్టు
గూడు క్రింద నిదురించే పక్షుల గుంపులు కదిలినట్టు
కళ్ళు మూసుకోగానే గతం వేయి రెక్కలతో గుండెలపై పర్వతమై కదులుతుంది
పొన్నచెట్టు నీడలో ఆమె కళ్ళ మిలమిలలపై వెన్నెల సంతకాలు చేస్తుంటే
చూపులతో ఆమె మనసును తాగిన చిరునవ్వును
గుండెల్లో దాచుకుని —
ఒక్క చిరుముల్లు గ్రామఫోన్‌ను పాడిస్తున్నట్టు
ఒక్క సిరినవ్వే జీవితాన్ని నడిపిస్తుంది ఎడారిలోనుంచి ఎదలోకి
ఎన్ని మెట్లో ఎక్కి ఎక్కి....నడచి నడచి
ఏది ఆవలి తీరం....?
కిటికీలోనుంచి చూస్తుంటాను రోడ్డు చివర అస్తమిస్తున్న సూర్యుణ్ణి
మట్టిలోకి దిగిపోయే విత్తన మేమౌతుంది
మొలకెత్తుతుంది వేల చేతులతో తప్పకుండా—

— రామా చంద్రమౌళి